



వేటకు విరామం

- నేటి నుంచి 61 రోజుల పాటు చేపల వేటపై నిషేధం
- భృతి చెల్లింపునకు ఈనెల 17న సర్వే
- ఈనెల చివరి వారంలో తుది జాబితా
- మే పదో తేదీన నగదు జమ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సముద్రంలో చేపల వేటపై శుక్రవారం నుంచి నిషేధం అమలు కానుంది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజుల పాటు చేపల వేటపై ప్రభుత్వం నిషేధం అమలు చేయనుంది. ఈ సమయాల్లో వేట సాగిస్తే మత్స్య సంపద దెబ్బతింటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏటా వేటకు విరామాన్ని ప్రకటిస్తూ వస్తోంది. చేపల వేటకు దూరంగా ఉంటున్న మత్స్యకారులకు ప్రభుత్వం 61 రోజుల కాలానికి రూ.10 వేలు భృతి చెల్లింపునకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. పరిహారం చెల్లింపునకు అర్హులైన వారిని గుర్తించేందుకు సర్వే చేపట్టాలని మత్స్యశాఖ నిర్ణయించింది. సర్వే కోసం ఇప్పటికే బృందాలను సిద్ధం చేసింది. ఈనెల 17వ తేదీ నుంచి బృందాలు సర్వే చేపట్టనున్నాయి.

వేట నిషేధ భృతిని 2018 వరకు మోటారు బోట్లకు పరిమితం చేయగా, రెండేళ్లుగా తెప్పలపై చేపల వేట సాగిస్తున్న వారికీ ప్రభుత్వం భృతిని వర్తింపజేసింది. జిల్లాలోని 11 మండలాల్లో 104 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. చేపల వేట ప్రధాన వృత్తిగా సుమారు 25 వేల కుటుంబాలు బతుకుతున్నాయి. గతేడాది 14,043 మందిని అర్హులుగా గుర్తించి వారికి పరిహారం అందించారు. వేట నిషేధ కాలపు పరిహారాన్ని ప్రభుత్వం కొందరికే పరిమితం చేస్తోంది. పడవలో గరిష్టంగా పది మంది వరకు చేపల వేటకు వెళ్తారు. మోటరైజ్డ్ బోట్లపై వేట సాగించిన వారిలో ఆరుగురికి, సంప్రదాయ తెప్పలపై వేట చేస్తున్న వారిలో ముగ్గురికి మాత్రమే సాయాన్ని అందిస్తోంది. దీంతో మిగిలిన మత్స్యకార కుటుంబాలు సాయం పొందలేకపోతున్నాయి. కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు వేటకు వెళ్తున్నా, అందులో ఒక్కరికే డబ్బులు అందిస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన సాయం డబ్బులనే అందరూ కలిసి పంచుకుంటున్న పరిస్థితి ఉంది.

ఈనెల 17న సర్వే

చేపల వేటపై నిషేధం నేపథ్యంలో అర్హులైన మత్స్యకారులను గుర్తించేందుకు అధికారులు సర్వే కోసం బృందాలను నియమించారు. వారు ఈనెల 17వ తేదీన జిల్లాలోని తీర ప్రాంత మండలాల్లో ఒకేసారి సర్వే చేపట్టనున్నారు. మత్స్యకారుల నుంచి బ్యాంకు ఖాతా, ఆధార్ నంబర్లు తదితర వివరాలను సేకరించనున్నారు. బోటుకు పైభాగంలో పసుపు, కింది భాగంలో నీలం రంగు వేయాలని నిబంధన విధించారు. రిజిస్ట్రేషన్ అయిన బోట్లకే పరిహారం చెల్లించనున్నారు. వివరాలను క్రోడీకరించి అర్హులైన వారి జాబితాలను సిద్ధం చేస్తారు. ఈనెల చివరి వారంలో తుది జాబితా ప్రదర్శించనున్నారు. మే పదో తేదీన ప్రభుత్వం నగదు జమ చేయనుందని అధికారులు చెప్తున్నారు.

మత్స్యకార భరోసా మార్గదర్శకాలు ఇవే...

వైఎస్సార్ మత్స్యకార భరోసాకు సంబంధించి ప్రభుత్వం పలు మార్గదర్శకాలను సూచిస్తూ ఈనెల ఆరో తేదీన ఉత్తర్వులు వెలువరించింది. పరిహారం పొందేందుకు 18 నుంచి 60 ఏళ్ల మధ్య ఉండాలని సూచించింది. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే సాయం అందిస్తామని పేర్కొంది. మత్స్యకార పెన్షన్ పొందుతున్న వారిని అనర్హులుగా ప్రకటించింది. పల్లం భూమి మూడు ఎకరాలు లేదా మెట్టు పది ఎకరాలకు మించి ఉండకూడదని నిబంధన పెట్టింది. నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉన్న వారిని అనర్హులుగా పేర్కొంది. కుటుంబ విద్యుత్ వినియోగం 300 యూనిట్లకు మించకూడదని సూచించింది. కుటుంబంలో ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లలో పనిచేసే ఉద్యోగులు ఉంటే వారిని అనర్హులని తెలిపింది. కుటుంబంలో ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లిస్తుంటే, వారికీ పథకం వర్తింపజేయమని తెలిపింది.

నిషేధం ఉత్తర్వులు ధిక్కరిస్తే జరిమానా

చేపల వేటపై ప్రభుత్వం ఈనెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు నిషేధం విధించింది. మత్స్య సంపద వృద్ధికి మత్స్యకారులు సహకరించాలి. నిషేధిత సమయంలో వేటకు వెళ్లిన వారికి ప్రభుత్వం ఇచ్చే ఆర్థికసాయం నిలిపివేస్తాం. దీంతోపాటు నిషేధ ఉత్తర్వులను ధిక్కరిస్తే రూ.2,500 జరిమానా విధిస్తాం. సముద్రంలో పట్టిన చేపలను వేలం వేస్తాం. పడవలు, వలలు సీజ్ చేస్తాం.

- పి.వి శ్రీనివాసరావు, మత్స్యశాఖ ఉప సంచాలకులు

బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపితేనే...

రాజ్యాంగానికి రక్షణ

- సిపిఎం రాష్ట్ర నాయకులు సిహెచ్.నర్సింగరావు
- శ్రీకాకుళంలో సిపిఎం, సిపిఐ భారీ ర్యాలీ, సభ
- కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచార భేరి ప్రారంభం



ర్యాలీని ప్రారంభిస్తున్న సిపిఎం రాష్ట్ర నాయకులు నర్సింగరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపితేనే రాజ్యాంగానికి రక్షణ ఉంటుందని సిపిఎం రాష్ట్ర నాయకులు సిహెచ్.నర్సింగరావు అన్నారు. ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపిని సాగనంపుదాం... దేశాన్ని కాపాడుకుందాం నినాదంతో సిపిఎం, సిపిఐ తలపెట్టిన ప్రచార భేరి శుక్రవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా నగరంలో చేపట్టిన ర్యాలీకి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. కోడి రామ్మూర్తి స్టేడియం నుంచి ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ కూడలి, డే అండ్ నైట్, ఏడు రోడ్ల కూడలి, పాతబస్టాండ్, సూర్యమహల్ కూడలి, రామలక్ష్మణ కూడలి మీదుగా స్థానిక అటవీశాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలని, రాజ్యాంగంపై దాడిని ఖండించాలంటూ ర్యాలీ పొడవునా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ప్రజా నాట్యమండలి కళాకారులు అభ్యుదయ గీతాలను ఆలపించారు. అనంతరం అటవీశాఖ కార్యాలయం సమీపంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ సెక్యులరిజం, ఫెడరల్ విధానం, ప్రభుత్వరంగ సంస్థల్లో ప్రయివేట్‌కు తావులేని విధానాలు వంటి మంచి ఆశయాలతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచిస్తే, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని విమర్శించారు. సామాజిక న్యాయం, సమానత్వం వంటి లక్ష్యాలతో రూపొందించిన రాజ్యాంగాన్ని కేంద్ర ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని విమర్శించారు. ఒకవైపు మతతత్వాన్ని రెచ్చగొడుతూ మరోవైపు దళితులు, గిరిజనులపై దాడులు సాగిస్తోందని చెప్పారు. దేశంలో మైనార్టీలు బతకలేని పరిస్థితిని కల్పించిందని విమర్శించారు.

రాష్ట్ర విభజన జరిగి ఎనిమిదేళ్లు గడిచినా హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. భావనపాడు పోర్టును అదానీకి కట్టబెట్టేందుకే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈనెల 19న పోర్టు శంకుస్థాపనకు వస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే గంగవరం, కృష్ణపట్నం పోర్టులతో పాటు విశాఖపట్నం పోర్టులోని బెర్తులను సైతం కేటాయించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను అదానీప్రదేశ్‌గా మార్చేస్తున్నారని విమర్శించారు. భావనపాడు పోర్టు పేరుతో భూములు తీసుకుంటున్న ప్రభుత్వం వారికి పునరావాసం, పరిహారం చెల్లించకుండా దుర్మార్గ పద్ధతులను అనుసరిస్తోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ను దక్షిణ కొరియా కంపెనీకి అప్పగించేందుకు సిద్ధమవుతుంటే, 22 మంది ఎంపీలున్న వైసిపి ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోందని విమర్శించారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవడం కోసమే ఈనెల 14 నుంచి 30వ తేదీ వరకు రాజకీయ ప్రచార యాత్ర చేపట్టామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ విధానాలను ఎండగట్టి ప్రజలను చైతన్యవంతం చేస్తామని చెప్పారు.

సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, బలగ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజలు కట్టిన పన్నులతో నిర్మించిన ప్రభుత్వరంగ పరిశ్రమలు, ఓడరేవులు, బ్యాంకులు, చివరకు వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. మోడీ అండతో అదానీ ప్రపంచాన్ని మోసం చేసి లక్షల కోట్లు ఎలా కొల్లగొట్టాడో హిండెన్‌బర్గ్ నివేదిక బట్టబయలు చేసిందన్నారు. అదానీ అక్రమాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ విచారణకు కూడా బిజెపి ప్రభుత్వం అంగీకరించడం లేదని విమర్శించారు. విభజన హామిలు అమలు చేయకుండా, విశాఖకు రైల్వేజోన్ ఇవ్వని బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించేందుకు సిద్ధమవుతోందన్నారు. రాష్ట్రానికి బిజెపి తీరని ద్రోహం చేస్తున్నా వైసిపి, టిడిపి ఏమీ మాట్లాటం లేదని విమర్శించారు.

కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, జి.సింహాచలం, నాయకులు కె.నాగమణి, పి.తేజేశ్వరరావు, పి.ప్రసాదరావు, టి.తిరుపతిరావు సిహెచ్.అమ్మన్నాయుడు, ఎన్.వి.రమణ, కొత్తకోట అప్పారావు, ఎ.లక్ష్మి, సిపిఐ నాయకులు డోల శంకరరావు, చాపర వెంకటరమణ, చిక్కాల.గోవిందరావు, పి.ప్రభావతి, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసు, ప్రజా నాట్యమండలి కళాకారులు సిహెచ్.రామచంద్రరావు, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయసాధనకు కృషి

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న స్పీకర్ సీతారాం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి స్పీకర్ సీతారాం, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్పి జి.ఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ శుక్రవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంబేద్కర్ కళావేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. అంబేద్కర్ జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. యువత వికాసానికి బాటలు వేసిన దార్శనికుడు అంబేద్కర్ అని కొనియాడారు. భారత రాజ్యాంగ నిర్మాతగా దేశ ఔన్నత్యాన్ని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వవ్యాప్తం చేశారన్నారు. అంటరానితనం, కుల నిర్మూలన కోసం ఎంతో కృషి చేశారని చెప్పారు. అంబేద్కర్ ఆశయసాధనలో భాగంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. సంక్షేమ ఫలాలను అందుకుని సమాజంలో సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అంబేద్కర్ అడుగుజాడల్లో ముందుకు సాగడమే ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని అన్నారు.

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ అంబేద్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ప్రతిఒక్కరూ చదువుకు ప్రాముఖ్యత ఇవ్వాలని, దాని ద్వారానే మార్పు వస్తుందన్నారు. అంబేద్కర్ మహారాష్ట్ర వాసి కావడం, తానూ మహారాష్ట్రలో జన్మించడం నాకు గర్వంగా ఉందన్నారు. అంబేద్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని ఎస్పి జి.ఆర్ రాధిక అన్నారు. దేశ ప్రథమ న్యాయశాఖ మంత్రిగా పనిచేసినప్పుడు మహిళా హక్కులను చట్టబద్ధం చేయడానికి ప్రాధాన్యతనిచ్చారని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు రాజకీయంగా, సామాజికంగా ఉన్నత స్థానాల్లో ఉన్నారంటే దానికి అంబేద్కర్ కారణమన్నారు.

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా అందరికీ సమాన హక్కు కల్పించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, విద్యావేత్త అయిన ఆయన అట్టడుగున ఉన్న దళిత బహుజనులకు రాజ్యాంగబద్ధంగా అభివృద్ధిపథంలోకి తీసుకురావడానికి ఎంతగానో కృషి చేశారని తెలిపారు. విద్యార్థులు అంబేద్కర్ బాటలో నడుచుకుని ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిపిఒ రవికుమార్, డ్వామా పీడీ చిట్టిరాజు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ గడ్డెమ్మ, దళిత సంఘాల నాయకులు కె.రాంగోపాల్, తైక్వాండో శ్రీను, కంఠ వేణు, మిస్కా కృష్ణయ్య, యజ్జల గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

నౌపడ : ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి వైద్య సిబ్బందిని ఆదేశించారు. సంతబొమ్మాళి మండలంలోని నౌపడ పిహెచ్‌సిని శుక్రవారం సందర్శించారు. పిహెచ్‌సి పరిసరాలు, ల్యాబ్, ఫార్మసీ, ఆపరేషన్ థియేటర్, నోటీసు బోర్డులు, ఒపి నమోదును పరిశీలించారు. ఈనెల 19న సిఎం పర్యటన నేపథ్యంలో నిర్వహించబోయే మెడికల్ క్యాంపు, వైద్య సేవలపై వైద్యాధికారులు ఒ.పర్మిల, ఎన్.నందినితో సమీక్షించారు. 108 అంబులెన్స్‌లు, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఎండలు, ఉక్కపోత కారణంగా ప్రజలు అస్వస్థతకు గురైతే చికిత్సకు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఐదు పిహెచ్‌సిల సిబ్బంది సమన్వయంతో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు.

ఆ బాధ్యత ప్రభుత్వాలదే

పూర్వపు ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


సదస్సులో మాట్లాడుతున్న ఎం.వి.ఎస్ శర్మ

రాజ్యాంగం ద్వారా ప్రజలకు కల్పించిన హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పూర్వపు ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ అన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో అంబేద్కర్ 132వ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ ఆధ్వర్యాన 'ఉద్యమాలు-నిర్బంధాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రతిఘటన చేసే శక్తులపై ప్రభుత్వాలు నిర్బంధాలు ప్రయోగిస్తున్నాయని విమర్శించారు. నిర్బంధాలకు వ్యతిరేకంగా పోరాడడం ద్వారానే హక్కులను కాపాడుకోగలమని స్పష్టం చేశారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పదేళ్లలో రిజర్వేషన్లు అవసరం లేకుండా సమాజం ముందుకు పోతుందని ఆశించారని, అన్నిరకాల అంతరాలు తగ్గకపోగా మరింత పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక అంతరాలు తగ్గకుండా దేశాభివృద్ధి సాధ్యం కాదన్నారు. ఒక శాతం ప్రజల వద్ద 27 శాతం ధనం ఉంటే ఎలా సామాజిక న్యాయం సాధిస్తామని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.9 లక్షల కోట్ల అప్పు మాఫీ చేసిందని చెప్పారు. విద్య, ఆరోగ్య, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమాన న్యాయం సాధించకుండా రాజ్యాంగ విలువలు నిలబడవన్నారు.

సామాజిక న్యాయం - ఆర్థిక విధానాలు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వరంగంలో విద్య ఉండడం ద్వారానే సామాజిక న్యాయం అమలవుతుందన్నారు. ఎన్ఇపి-2020 విధానం వల్ల విద్య వ్యాపారీకరణ, కేంద్రీకరణ, మతతత్వీకరణ, ప్రయివేటీకరణ జరుగుతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్కరణలు శరవేగంగా అమలు చేస్తోందని చెప్పారు. దీనివల్ల పాఠశాలలు, ఉపాధ్యాయుల పోస్టులు తగ్గిపోతున్నాయని తెలిపారు. ప్రభుత్వరంగంలో విద్య ఉండడం ద్వారానే విద్యలో సామాజిక న్యాయం అమలవుతుందన్నారు. సదస్సులో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా కోశాధికారి బి.శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.ఉమాశంకర్, జెవివి ప్రధాన కార్యదర్శి జి.గిరిధర్, యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


జెండా ఊపి ప్రారంభిస్తున్న సీతారాములు

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి ఎం.వరప్రసాద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి ఎం.వరప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్ర అగ్నిమాపక శాఖ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రపతి అవార్డు గ్రహీత, విశ్రాంత అగ్నిమాపక అధికారి గురుగుబెల్లి సీతారాములు అగిమాపక వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏవిధంగా ప్రతిస్పందించాలి, నివారణ చర్యలు తీసుకునేందుకు తగిన సలహాలు సూచనలు అందించారు. అనంతరం వరప్రసాద్ మాట్లాడుతూ వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో వరికుప్పలు అగ్ని ఆహుతికి గురయ్యే ప్రమాదము ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గృహిణులు గ్యాస్ పైప్‌లైన్ వాడకంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన పైపులనే వాడాలన్నారు. ఆస్పత్రులు, పాఠశాలలు అగ్నిమాపక నియమ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. అగ్ని ప్రమాదాల ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక వీరులకు నివాళులర్పించారు. అగ్నిమాపక శాఖ అందిస్తున్న సేవలు, యంత్రాలు, పరికరాలను సిబ్బంది ఏవిధంగా వినియోగించాలని వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, పలు సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

హార్బర్‌తో అభివృద్ధి

మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

బుడగట్లపాలెం వద్ద రూ.365 కోట్లతో హార్బర్ నిర్మాణానికి ఈనెల 19వ తేదీన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని బుడగట్లపాలెంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హార్బర్ నిర్మాణంతో ఈ ప్రాంత అభివృద్ధితో పాటు మత్స్యకారుల వలసల నివారణ సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో సుమారు వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్నా విశాఖపట్నం, కాకినాడలోనే హార్బర్లు ఉన్నాయన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె, బాపట్ల జిల్లా నిజాంపట్నం, మచిలీపట్నం, బియ్యపుతిప్ప కాకినాడ జిల్లా ఉప్పాడ, అనకాపల్లి జిల్లా పూడిమడక, ఎచ్చెర్లలోని బుడగట్లపాలెంలో హార్బర్ల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట వద్ద ఫిష్ లాండింగ్ సెంటర్‌ను పూర్తి చేస్తామన్నారు. మత్స్యకార కుటుంబాలను ఉద్ధరిస్తామని చెప్పడం తప్ప ప్రతిపక్ష నాయకులు చేసిందేమీ లేదని విమర్శించారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, మత్స్యశాఖ జెడి పి.శ్రీనివాసరావు, మత్స్యకార సంఘం అధ్యక్షులు కోనాడ నర్సింగరావు, రాష్ట్ర ఫైనాన్స్ మహిళా కార్పొరేషన్ చైర్మన్ బల్లాడ హేమమాలిని రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు జరుగుళ్ల శంకరరావు, పిఎసిఎస్ చైర్మన్ సనపల నారాయణరావు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, వైసిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి బల్లాడ జనార్ధన్ రెడ్డి, ఎంపిటిసి ప్రతినిధి కూన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బలసలరేవు వంతెనకు అనుమతులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఆమదాలవలస మండలం ఇసకలపేట, సంతకవిటి మండలం వాల్తేరు గ్రామాల మధ్య బలసలరేవు వారధి నిర్మాణానికి అన్ని అనుమతులు మంజూరైనట్లు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆమదాలవలస, విజయనగరం జిల్లా సంతకవిటి మండలం రెవెన్యూ అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. నాగావళి నది పరివాహక సరిహద్దు గ్రామమైన వాల్తేరు పరిసర ప్రాంతాల్లో సర్వేలో సుమారు 64 మంది రైతుల నుంచి 6.67 ఎకరాల భూమిని గుర్తించామని అధికారులు తెలిపారు. అందులో ప్రభుత్వ భూమి 1.67 ఎకరాలు ఉందన్నారు. 6.50 ఎకరాలకు సంబంధించి సర్వేలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ 480 మీటర్ల పొడవుతో, 12.5 మీటర్ల వెడల్పుతో రూ.40.22 కోట్ల అంచనాలతో వారధి నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. వాల్తేరు వద్ద 770 మీటర్లు, ఇసకలపేట వద్ద 920 మీటర్ల బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 13.191 ఎకరాల భూమి అవసరమన్నారు. ఈ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్అండ్‌బి అధికారులు, సంతకవిటి, ఆమదాలవలస తహశీల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.35 కోట్లతో ఆర్అండ్ఆర్ కాలనీ

ప్రజాశక్తి - నౌపడ


ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

594 మంది భావనపాడు పోర్టు నిర్వాసితులకు రూ.35 కోట్లతో 55 ఎకరాల్లో నౌపడలో అధునాతన వసతుల గల ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మించనున్నామని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన అనంతరం శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు మూలపేట, విష్ణుచక్రంలో 320 ఎకరాలను సేకరించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి మరో పది శాతం వరకు పరిహారాన్ని రైతులకు చెల్లించాల్సి ఉందన్నారు. మరో 320 ఎకరాలు అప్రోచ్ రోడ్డుకు సేకరించామన్నారు. మొదటి ఫేజ్‌లో సిఆర్‌జెడ్, ప్రభుత్వ, అటవీ భూములు మొత్తం వెయ్యి ఎకరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. రెండో ఫేజ్‌లో పోర్టు అభివృద్ధికి మరికొన్ని భూములు రైతుల నుంచి సేకరించాల్సి ఉంటుందన్నారు. ఆర్అండ్ఆర్ కాలనీకి ఈనెల 11వ తేదీన ప్రభుత్వం నుంచి ప్లాన్ అప్రూవల్ వచ్చిందని తెలిపారు. భూములు ఇచ్చిన రైతులకు వారం రోజుల్లో పరిహారం చెల్లిస్తామన్నారు. పోర్టుతో జిల్లా ప్రజల చిరకాల కల నెరవేరుతుందన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. పోర్టు నిర్మాణానికి సహకరించిన రైతులకు ప్రభుత్వం తరుపున ధన్యవాదాలు తెలిపారు.

సిఎం పర్యటనా ఏర్పాట్లు పరిశీలన

భావనపాడు పోర్టు శంకుస్థాపనకు మూలపేట, నౌపడలో ముఖ్యమంత్రి ఈనెల 19న పర్యటించనున్న నేపథ్యంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్పి జి.ఆర్ రాధిక శుక్రవారం పరిశీలించారు. ట్రాఫిక్ మళ్లింపు, వివిఐపి వాహనాల పార్కింగ్, హెలీప్యాడ్, ప్రోటోకాల్ నిర్వహణ తదితర అంశాలపై పోలీసులు, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. విష్ణుచక్రంలో నిర్మితమవుతున్న పైలాన్, నౌపడలో సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. శంకుస్థాపన ప్రాంతంలో నిర్వాసితులతో సిఎం మాట్లాడే అవకాశం ఉండడంతో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, అదనపు ఎస్పి టి.పి విఠలేశ్వరరావు, డిఎస్పి శివరాం రెడ్డి, తహశీల్దార్ చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో లేని అంబేద్కర్ ఆనవాళ్లు

ప్రజాశక్తి - ఆమదాలవలస


అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న కూన రవికుమార్

అమరావతిలో అంబేద్కర్ ఆనవాళ్లు లేకుండా చేయాలన్నదే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దురాలోచన అని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఆరోపించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో రాజధాని అమరావతిలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పి స్మృతివనాన్ని, జ్ఞాన మందిరాన్ని ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో నిధులను కేటాయించిందని తెలిపారు. వైసిపి అధికారంలోకొచ్చాక మహోన్నత వ్యక్తి జ్ఞాపకాలు ఉండకూడదన్న దురాలోచన చేసిందన్నారు.

వేచి చూసిన స్పీకర్

ప్రోటోకాల్ ప్రకారం శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించాల్సి ఉన్నా, ఆయన రావడం కొద్దిగా ఆలస్యమైంది. రవికుమార్ ముందుగా వచ్చి అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి ప్రసంగాన్ని కొనసాగిస్తుండగా స్పీకర్ అక్కడకు చేరుకున్నారు. దీంతో సుమారు పావుగంట పాటు మెయిన్ రోడ్డుపై వాహనంలోనే ఉండిపోయారు. రవికుమార్ ప్రసంగం పూర్తయిన తర్వాత వెళ్లిపోవడంతో స్పీకర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆదర్శప్రాయుడు అంబేద్కర్



కవిటి: అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న విజయ, రామారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, హరీష్ అన్నారు. నగరంలోని అంబేద్కర్ జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు చందు, దుర్గాప్రసాద్, ఉమామహేశ్వర్, రవితేజ, భరణి తదితరులు పాల్గొన్నారు.

గాంధీ స్మారక మందిరంలో... గాంధీ స్మారక మందిరంలో అంబేద్కర్ విగ్రహానికి విజిలెన్స్ ఎస్‌పి ఎ.సురేష్‌బాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సురంగి మోహనరావు, జామి భీమశంకర్, బరాటం లక్ష్మణరావు, నటుకుల మోహన్, కొంక్యాన మురళీధర్, కొంక్యాన వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయంలో... నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి సెల్ జిల్లా అధ్యక్షులు పొన్నాడ రుషి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యాన... నగరంలోని అంబేద్కర్ కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, నాయకులు ఎం.పురుషోత్తం, జామి భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాపరిషత్‌లో... జిల్లాపరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో...

ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ అడపా మోహన్‌రాజు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు లక్ష్మీపతి, చిన్నారావు, జెకెసి సమన్వయకర్త డి.పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్ వాకర్స్ ఆధ్వర్యాన...

ఆర్ట్స్ కళాశాల మైదానంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్పోర్ట్ వాకర్స్ అధ్యక్షులు శాసపు జోగినాయుడు, హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యులు జి.వాసుదేవరావు, వాకర్స్ రీజియన్ కౌన్సిలర్ కూన వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన...

జ్యోతిరావు పూలే పార్కులో బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పి.చంద్రపతిరావు ఆధ్వర్యాన అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు.

శ్రీకాకుళం మండలం సింగుపురం పంచాయతీ మునసబుపేటలో అంబేద్కర్ జయంతి వేడుకల్లో టిడిపి మహిళా నాయకులు గొండు స్వాతి శంకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ కుంచాల ఆదినారాయణరావు, మెండ గంగరాజు, రంధి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మారుతీ వాకర్స్ ఆధ్వర్యాన...

మారుతీ వాకర్స్ ఇంటర్నేషనల్ 102 డిప్యూటీ గవర్నర్ కొంక్యాన మురళీధర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఆయనతో పాటు మారుతీ వాకర్స్ క్లబ్ కార్యదర్శి పొట్నూరు నాగేశ్వరరావు, కోశాధికారి పంచాది నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బిఐ ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన...

ఎస్‌బిఐ ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన నగరంలో ప్రచార యాత్ర నిర్వహించారు. చీఫ్ మేనేజరు బి.చంద్రశేఖర్, ఎజిఎం కెవిఎన్‌బి భీమ్‌కుమార్ ప్రచార రథాన్ని జెండా ఊపి వారు ప్రారంభించారు. అంతకు ముందుకు స్టేట్ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగుల సంఘం కార్యదర్శి శ్రీనివాస్, ఎస్‌బిఐ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అర్జి కోటి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటిలో... ఎచ్చెర్లలోని ట్రిపుల్ ఐటిలో అంబేద్కర్ చిత్రపటానికి ట్రిపుల్ ఐటి డైరెక్టర్ పి.జగదీశ్వరరావు, ఒఎస్‌డి ఎల్.డి సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని జూనియర్ కళాశాల వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ సీనియరు నాయకులు సనపల అన్నాజీరావు పూలమాలేసి, నివాళులర్పించారు.

బొడ్డేపల్లిపేటలోని వైసిపి కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అంబేద్కర్ విగ్రహం వరకు వైసిపి నాయకులు ర్యాలీ చేపట్టారు. వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సువ్వారి సత్యనారాయణ, వైకుంఠరావు, విజయ రమణారావు, బి.నేతాజీ, రాజశేఖర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి కాలనీలో మాలమహానాడు అధ్యక్షులు బి.అప్పారావు, బి.రంగంనాయుడు అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విగ్రహ దాత బలగ దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట: పోలాకి, నరసన్నపేట మండలం తామరాపల్లి, ఉర్లాంలో అంబేద్కర్ విగ్రహాలను ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆవిష్కరించారు. నరసన్నపేట అంబేద్కర్ కూడలిలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

కవిటి: స్థానిక బస్టాండ్ కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే నర్తు రామారావు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పిరియా సాయిరాజ్, కడియాల పద్మ, కె.ప్రకాష్, పూడి లక్ష్మణరావు,



నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి



లావేరు: అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

పి.శ్రీరాములు, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పలాస: మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ సురేష్‌బాబు, టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, విఠల్‌రావు, జి.కృష్ణారావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

కాశీబుగ్గలో దళిత హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి అరుణ్‌కుమార్, అనిల్ రాజ్, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, రైల్వే ఎంప్లాయ్ నాయకులు జివిఎల్‌కె.రెడ్డి పూలమాలేసి నివాళులర్పించారు.

సూదికొండలో అంబేద్కర్ విగ్రహానికి శిష్టు గోపీ ఆధ్వర్యాన అంబేద్కర్ జయంతి నిర్వహించారు. బోనెల అశిరయ్య, బడా సూరన్న, డప్పు కళాకారులు, తప్పెటగుళ్లు, భారత నాట్యం, కూచిపూడి, పాటలు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో బల్ల గిరిబాబు, సురేష్‌బాబు, రా ము, తోట సిమ్మయ్య, దుమ్ము రాజులు, తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: మండల పరిషత్ కార్యాలయం వద్ద, పెద్దతామరాపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కె.బాలకృష్ణారావు, బి.నారాయణరావు పూలమాలేసి, నివాళులర్పించారు. అనంతరం కేకు కోశారు. కార్యక్రమంలో చిన్ని జోగారావు యాదవ్, ఎ.విష్ణు, ధనరాజ్, ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంఇఒ దేవేంధర్, మండల కేంద్రంలో బిజెపి, జనసేన నాయకులు, పెద్ద పద్మాపురంలో ఎంపిటిసి ప్రతినిధి ఉర్లాన రుషి, మారుతి శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి చింతల అప్పారావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేసి, నివాళులర్పించారు.

నౌపడ: సీతానగరం ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం మధు, రిక్క బాబ్జీ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మర్రిపాడులో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పలువురు యువకులు జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సీమల జానకిరాం, సామ స్యామ సుందరావు, ఎన్.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: బోరుభద్రలో సర్పంచ్ బుస్కల లక్ష్మీకాంతం, చింతాడ చిన్నారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతాడ దిలీప్ కుమార్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. సంతబొమ్మాళిలో సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి, టిడిపి నాయకులు జీరు భీమారావు, కాంతారావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసి, నివాళులర్పించారు.

ఇచ్ఛాపురం: మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సెల్లా సుగుణ, కమిషనర్ రమేష్, కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. డిటి శ్రీహరి, జెడ్‌పిటిసి నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు. బస్టాండ్ వద్ద బిజెపి నాయకులు తారక రామారావు, తదితరులు అంబేద్కర్‌కు నివాళులర్పించారు.

వజ్రపుకొత్తూరు: పాత టెక్కలిలో సిపిఎం నాయకులు బి.ఆనందరావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో చంటి, పద్మారావు, తుంగాని లక్ష్మీనారాయణ, సుబ్బారావు, డి.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: కాశీనగర్‌లోని మూడో వార్డులో అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, ఎన్ఎసి అధ్యక్షులు బి.సుధారాణి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉదయ్‌లిమా, కిషోర్ నాగ బంశ, ఆర్.మధు, తదితరులు పాల్గొన్నారు.

1, 2 వార్డుల్లో నిర్వహించిన అంబేద్కర్ జయంతిలో జెడ్‌పి అధ్యక్షులు గవర తిరుపతి, కాశీనగర్ ఎన్ఎసి అధ్యక్షులు ఎం.సుధారాణి, బిడిఒ, తదితరులు పాల్గొన్నారు.

లావేరు : పాతకుంకాంలో ఎమ్మెల్యే జి.కిరణ్‌కుమార్, మెట్టవలసలో బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నదుకుదిటి ఈశ్వరరావు అంబేద్కర్ విగ్రహాలను వేర్వేరుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు, వైసిపి నాయకులుకంది నాని, మహంతి వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి / రూరల్: పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద విగ్రహానికి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, ఎంపిపి ఎ.సరోజనమ్మ, సర్పంచ్ జి.సుజాత, నాయకులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో బి.శేషగిరి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనరు పేడాడ పరమేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిరణ్‌కుమార్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో మామిడి రాము, హెచ్.రామకృష్ణ, పురుషోత్తం, ఆనందరావు, మధుసూదనరావు, ఎ.శ్రీధర్, నర్సిపురం శేఖర్, హరి, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యాన ఆదిఆంధ్రావీధిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్.ఈశ్వరరావు, కొల్లి ఎల్లయ్య, దుర్గాప్రసాద్, లక్ష్మణరావు, డి.గోపి, యాగాటి శివరావు, తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, తన నివాసంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, జెవివి అధ్యక్షులు కె.కామేశ్వరరావు, ప్రజా చైతన్య కళా సమితి భవనంలో దూసి ఆంధ్రాస్టాలిన్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

కోటబొమ్మాళి: మండల పరిషత్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎంపిపి ఉమామల్లేశ్వరరావు, ఎడ్‌పిటిసి డి.వెంకటరావు, మండల ప్రత్యేక అధికారి లోకనాథం, తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ పూలమాలేసి, నివాళులర్పించారు. టిడిపి కార్యాలయం నుంచి అంబేద్కర్ జయంతి సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి బి.గోవిందరాజులు, బి.రమేష్ నిర్వహించారు. ఊడికలపాడులో సర్పంచ్ ఎన్.అప్పలస్వామి, చిన్న హరిశ్చంద్రపురంలో కళింగ సంక్షేమ సంఘం అధ్యక్షులు పూర్ణరావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసి, నివాళులర్పించారు.



ఆమదాలవలస: పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సువ్వారి గాంధీ

పొందూరు: మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో విగ్రహానికి షెడ్యూల్డ్ కులాల, తెగల సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎం.సునీల్‌కుమార్ పూలమాలేసి, నివాళులర్పించారు.కార్యక్రమంలో ఎంపిపి ఉషారాణి, జెడ్‌పిటిసి కాంతారావు, సర్పంచ్ రేగడ లక్ష్మి, పి.రమేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: కొత్తగూడలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మక అప్పన్న, వైసిపి నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాద్, టిడిపి నాయకులు ఎ.భైరాగి, సర్పంచ్ పి.కృష్ణవేణి, మెట్టూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పిఎసిఎస్ అధ్యక్షులు సూర్యనారాయణ, బలదలో వైసిపి నాయకులు సారిపల్లి ప్రసాద్‌రావు, పారాపురంలో బిఎస్‌పి నాయకులు బి.కృష్ణారావు, నివగాంలో రాంరాజు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు రామరాజు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

కంచిలి: మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, ఎంపిపి దేవదాస్‌రెడ్డి, జై భీమ్‌సేన జిల్లా నాయకులు మర్రిపాటి పూర్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ బాబురావు, ఇప్పిలి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు. ఉన్నత పాఠశాలలో రైతు సంఘం నాయకులు గోపీనాథ్, ఉపాధ్యాయులు పూలమాలవేసి, నివాళులర్పించారు.

జి.సిగడాం: మండలంలోని మధుపాంలో సర్పంచ్ బోగాది అప్పలనాయుడు, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ చామంతుల రామారావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసి, నివాళులర్పించారు.

రణస్థలం రూరల్: మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి బిజెపి ఎచ్చెర్ల నియోజకవర్గ కన్వీనరు నడుకుదిటి ఈశ్వరరావు పూలమాలేసి, నివాళులర్పించారు. ఎంపిపి ప్రతినిధి పి.సాయికుమార్, జెడ్‌పిటిసి టి.సీతారాం, జెఆర్‌పురం సర్పంచ్ భవిరి రమణ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొత్తకోట్ల సింహాద్రినాయుడు పూలమాలేసి, నివాళులర్పించారు.

సోంపేట: సోంపేటలో జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ, జెడ్‌పిటిసి టి.యశోద, ఎంపిపి దాసు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసి, నివాళులర్పించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. టిడిపి నాయకులు చంద్రమోహన్, చిత్రాడ శ్రీను, శేఖర్, మధు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసి, నివాళులర్పించారు. బారువ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ధర్మారావు అంబేద్కర్ జయంతి నిర్వహించారు.

పర్లాకిమిడి : పర్లాకిమిడిలో సిపిఎం కార్యాలయంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో దొండపాని రైతో, ఎం.బంగారయ్య, మహత మిశాల్, డి.వెంకటరావు, శ్రీను బెహరా, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

శ్రీకాకుళం తహశీల్దార్‌కు పరామర్శ



తహశీల్దార్‌ను పరామర్శిస్తున్న ధర్మాన

లావేరు: శ్రీకాకుళం తహశీల్దార్ నిడిగంటల వెంకటరావును లావేరులోని తన నివాసంలో పలువురు ప్రముఖులు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల ఒకే రోజు వెంకటరావు తల్లి దుర్గమ్మ, సతీమణి పద్మజ మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తహశీల్దార్‌ను పరామర్శించారు. మృతికిగల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల చిత్రపటాలకు పూలమాలేసి, నివాళులర్పించారు. ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, వై.వి.సూర్యనారాయణ, పూర్వ జెసి పి.రజనీకాంతారావు, అంధవరపు సూరిబాబు, పిన్నింటి సాయికుమార్, లుకలాపు అప్పలనాయుడు, శ్రీనివాసరావు, తదితరులు పరామర్శంచారు.

ఘనంగా కలమట జన్మదిన వేడుకలు



కేకు తినిపిస్తున్న రామ్మోహన్‌నాయుడు, కూన

ప్రజాశక్తి - కొత్తూరు

మండలంలోని నివగాం క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అధ్యక్షతన కె.మోహనరావు 87వ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా శుక్రవారం జరిగాయి. శ్రీకాకుళం ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు ఈ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. మోహనరావు నీతి, నిజాయితీకి మారుపేరుగా నిలిచారన్నారు.ఆయన అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అశోక్, కూన రవికుమార్ మాట్లాడుతూ తన జీవితాన్ని ప్రజల కోసం అంకితం చేశారని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించి, వారి అభిమానాన్ని పొందారని అన్నారు. అనంతరం టిడిపి నాయకులు, కార్యకర్తలు మోహనరావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పుట్టిన రోజు కేకును కోసి, కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో కలమట సాగర్, ఎ.భైరాగినాయుడు, పి.బుచ్చిబాబు, సివ్వల తేజేశ్వరరావు, పైల లచ్చుమయ్య, దాస్‌నాయుడు, అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

వార్డు మెంబరు రాజీనామా

పొందూరు: మండలంలోని గోకర్ణపల్లి పంచాయతీ రంగనాథపేట గ్రామానికి చెందిన 9వార్డు మెంబర్, ఉపసర్పంచ్ పేడాడ రేవతి వార్డు సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని ఎంపిడిఒ కార్యాలయానికి అందజేశారు. అంగన్వాడీ పోస్టుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈమె రాజీనామా చేసినట్లుగా సమాచారం. ఆమె సమర్పించిన రాజీనామా లేఖను జిల్లా పంచాయతీ అధికారుల ఆమోదానికి పంపినట్లు ఎంపిడిఒ కార్యాలయం అధికారులు తెలిపారు.

అనారోగ్యంతో విఆర్‌ఒ మృతి

పలాస: మొగిలిపాడు గ్రామానికి చెందిన విఆర్‌ఒ సిహెచ్ రాంబాబు(55) అనారోగ్యంతో మృతి చెందారు. బత్తుల వీధి సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఈయన వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మతునికి భార్య రాధిక, కుమారుడు యుగంధర్, కుమార్తె ఆశ ఉన్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ మధుసూదన్‌రావు, డిటి లక్ష్మీనారాయణ, ఆర్‌ఐ రవికుమార్, విఆర్‌ఒ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల నిమిత్తంరూ.25వేలు సాయం అందజేశారు.

గ్రామ రెవెన్యూ సహాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న విఆర్‌ఎలు

పొందూరు: గ్రామ రెవెన్యూ సహాయకుల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పొందూరు అంబేద్కర్ కూడలిలో విఆర్‌ఎల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తెండేల త్రినాథరావు ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి, వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్టాడుతూ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత కలిగిన వారికి ఉద్యోగోన్నతి కల్పించాలని, రూ.26వేలు కనీస వేతనం ఇవ్వాలని, అటెండర్లు, వాచ్‌మెనట్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని, డిఎతో కూడిన వేతనం ఇవ్వాలని, తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కె.సత్యనారాయణ, ఎన్.పాపారావు, పి.రమణ, వై.రాజారావు, బి.ఈశ్వరరావు, పి.జోగులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

అచ్చెన్నకు సవాల్ విసిరిన తిలక్



మాట్లాడుతున్న పేరాడ తిలక్

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

40 ఏళ్లుగా పరిపాలిస్తున్న కింజరాపు కుటుంబం కోటబొమ్మాళి మండలంలో ఎంత అభివృద్ధి చేశారో, నాలుగేళ్లలో వైసిపి ప్రభుత్వం ఎంత అభివృద్ధి చేసిందో బహిరం చర్చలకు సిద్ధమా? అని ఎమ్మెల్యే అచ్చెన్నాయుడుకు కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ సవాల్ విసిరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు ఆధ్వర్యాన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక ఒక్క రోడ్డుకూడా వేయలేదని అబద్ధాలు చెబుతున్న అచ్చెన్న కోటబొమ్మాళిలో రూ. 20 కోట్ల వ్యయంతో బిర్లంగి, నీలంపేట, సరియాబొడ్డపాడు, చలమ్మపేట, గంగరాం, వింజాంపాడు, దంత, తిలారు, చౌదరి కొత్తూరు నిమ్మాడ, సుబ్బారావుపేట, తాటిపర్తి, బోరుమజ్జిపాలేం, తులసిపేట, యలమంచిలి, శ్రీజగన్నాథపురం , కొత్తపల్లి గ్రామాలకు రోడ్డు వేశామన్నారు. రామయ్యపేట, చుట్టుగుండం గ్రామాలకు త్వరలో రోడ్డు వేయనున్నట్లు చెప్పారు. ఇవి మీ టిడిపి నాయకులకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. 27 సచివాలయ భవనాలు, నాడు నేడు ద్వారా పాఠశాలలు, అంగన్వాడీ భవనాలు ఇలా ఎన్నో అభివృద్ధి పనులతో పాటు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న సిఎంపై టిడిపి నాయకులు విమర్శలు మానుకోవాలని హితవుపలికారు. ప్రజలకు ఏ సంక్షేమ పథకం కావాలన్న మండల కేంద్రంలో ఉన్న ఎంపిడిఒ, ఎంఆర్‌ఒ, వ్యవసాయశాఖ ఇలా అధికారుల చుట్టూ తిరిగే పనిలేకుండా సచివాలయాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రకు జనాలు రాకపోవడంతో చంద్రబాబుకు ఏం చేయాలో అర్థం కావటం లేదని ఆరోపించారు. సమావేశంలో అన్నెపు రామారావు, పేడాడ వెంకటరావు, ఎన్.సింహాచలం, హెచ్.గోవిందరావు, తాతయ్య, తదితరులు పాల్గొన్నారు.

అదనపు యూనిట్ ఏర్పాటుకు పరిశీలన



ఆస్పత్రిలో వార్డులను పరిశీలిస్తున్న విజయ

ప్రజాశక్తి - సోంపేట

సోంపేట ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి ఆవరణలో ఉన్న డయాలసిస్ యూనిట్‌లో మరో అదనపు యూనిట్ ఏర్పాటుకు జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ శుక్రవారం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా డయాలసిస్ చేసుకుంటున్న వారితో ఆమె మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మరో రెండు యూనిట్లును ఆరోగ్యశాఖ మంత్రి రజిని సహకారంతో తేవడం జరిగిందని, సంబంధిత యంత్రాలను రెండు రోజుల్లో ఏర్పాటుచేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేవిధంగా చూడాలని కోరారు. నూతన భవన నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారితో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైద్యులకు సూచించారు. జనరల్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులకు పరామర్శిస్తూ వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సోంపేట ఎంపిపి నిమ్మన దాసు, జెడ్‌పిటిసి తడక యశోద, సోంపేట సర్పంచ్ నగిరి ప్రభావతమ్మ, సూపరింటెండెంట్ డాక్టర్ పెద్దింటి దుర్యోధన, తడక జోగారావు, ఎంపిటిసి పొడుగు కామేశ్వరరావు, తోట ఢిల్లీరావు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



లోలుగు జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న సర్పంచ్, ఎంపిటిసి

వాలీబాల్ విజేత లోలుగు

పొందూరు: మండలంలోని కింతలిలో అంబేద్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతగా లోలుగు, రన్నర్‌గా దల్లవలస జట్లు నిలిచాయి. తృతీయ స్థానంలో పూడివలస జట్టు నిలిచింది. విజేతలకు ట్రోఫీతో పాటు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు, పిఎసిఎస్ డైరెక్టర్ గిరి, నిర్వాహక కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



పలాసలో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - పలాస

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, బిజెపిని ఇంటికి సాగనంపే వరకు దేశ వ్యాప్తంగా ప్రచార భేరి నిర్వహిస్తామని సిపిఎం, సిపిఐ నాయకులు ఎన్.గణపతి, సిహెచ్ సుందర్‌లాల్ అన్నారు. ఈ సందర్భంగా వారు కాశీబుగ్గలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసి, నివాళులర్పించారు. అనంతరం ప్రచార భేరిలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎపికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను దగా చేస్తోందన్నారు. దేశంలోని సహజ వనరులను కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెడుతోందని విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రైవేటుపరం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో పోట్లాడాలన్నారు. లేకుంటే ప్రజల ముందు దోషిగా నిలడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సిహెచ్ వేణుగోపాల్, ఎన్.ఢిల్లేశ్వరి, జె.భాగ్యలక్ష్మి, వీరాస్వామి, మురళి, రవి, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపిని సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుకుందాం అంటూ శుక్రవారం టెక్కలి ఆదిఆంధ్రావీధిలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార భేరి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కరపత్రం, వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వీధిలో ఇంటింటికీ కరపత్రాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు ఎస్.షణ్ముఖరావు, కొల్లి ఎల్లయ్య, లండ వెంకటరావు, యుగంధర్, సుబ్రహ్మణ్యం, బమ్మిడి శేషు, యు.లక్ష్మణరావు, సచిన్, మన్మథరావు, గడ్డెయ్య, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: ప్రచార భేరి వాల్‌పోస్టర్‌ను సిపిఎం, సిపిఐ నాయకులు సిర్ల ప్రసాద్, నిమ్మక అప్పన్న ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ బిజెపి మతోన్మాద, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రచార భేరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి, గద్దె దించడమే ధ్యేయమన్నారు.



టెక్కలి: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు



ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి ర్యాలీలో రవికుమార్, తదితరులు

పథకాల పేరుతో భారాలు

ప్రజాశక్తి - బూర్జ

పథకాల పేరుతో వైసిపి ప్రభుత్వం ప్రజలపై భారాలను మోపుతోందని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని తమ్మినాయుడుపేటలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వి.సీతారాం, బాబునాయుడు, లంక జగన్నాథంనాయుడు, పి.కృష్ణారావు, హెచ్ గోపి, సుందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పలాస: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి అధికారంలోకి రావాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రకరకాల పన్నులు విధిస్తూ చివరికి చెత్తపై కూడా పన్ను వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలపై భారాలు మోపి, ఎడాపెడా బాదేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో లొడగల కామేశ్వరరావు, జి.సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, నాగరాజు, నవీన్, సురేష్, డొక్కరి శంకర్, ఆత్మారావు, పైల చక్రధర్ పాల్గొన్నారు.



అమ్మోజిని సన్మానిస్తున్న కలిశెట్టి అప్పలనాయుడు

అమ్మోజికి అభినందనలు

ప్రజాశక్తి-రణస్థలం

సాహిత్యం, సామాజిక సేవలోనే కాకుండా విధి నిర్వహణలోను ఉన్నతంగా రాణిస్తున్న కోష్ట మహిళా పోలీస్, వర్ధమాన రచయిత్రి అమ్మోజి బమ్మిడిని టిడిపి సీనియర్ నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం సన్మానించారు. ఇటీవల తిరుపతి లో 48 గంటల పాటు నిర్విరామంగా సాహిత్య, కళా ప్రదర్శనల్లో తాను భాగమై నాలుగు ప్రపంచ రికార్డుల్లో స్థానం దక్కించుకున్నందుకు శుక్రవారం కోష్టలో ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. సాహిత్యం, సామాజిక సేవాపరంగా తాను చేస్తున్న పనులు అడిగి తెలుసుకున్నారు. త్వరలో తాను తీసుకురాబోతున్న పుస్తకానికి ప్రింటింగ్, ఇతర ఖర్చులకు ఎంత అయినా తన కుమార్తె నిఖిల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేస్తామని తెలిపారు. తనను గుర్తించి అభినందించడమే కాకుండా పుస్తకం ఖర్చును భరిస్తా అని హామీ ఇవ్వడంపై అమ్మోజీ హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విఆర్‌ఒ సుబ్రహ్మణ్యం, కోష్ట గ్రామస్తులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న మణికంఠ

శ్రీకాకుళం అర్బన్: ప్రజల దాహార్తిని తీర్చేందుకు జిల్ ఫౌండేషన్, న్యూ బ్లడ్ బ్యాంకు శ్రీకాకుళం సంయుక్తంగా నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద మజ్జిగ ప్యాకెట్లను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యూ బ్లడ్ బ్యాంకు డాక్టర్ టి.మణికంఠ, జిల్ ఫౌండేషన్ ప్రతినిధి జాడ సాయి పంపిణీ చేశారు.

దేవాదాయశాఖ అధికారిగా చరణ్ ఎంపిక

టెక్కలి: దేవాదాయశాఖ అధికారిగా మండలానికి చెందిన దివ్వల చరణ్ ఎంపికయ్యాడు. దేవదాయశాఖ నిర్వహించిన పరీక్షలో ప్రతిభచాటాడు. బలరాంపురానికి చెందిన మల్లేశ్వరరావు, శార్వాణి దంపతుల కుమారుడు చరణ్ జిల్లాలోని ఓపెన్ కేటగిరిలో ఈ పోస్టుకు ఎంపికవ్వడంపై పేలువురు అభినందించారు. చరణ్ ప్రస్తుతం గుంటూరు జిల్లా ఆదాయ పన్నుల విభాగం కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రాజాం జిఎంఆర్ ఐటిలో బిటెక్ పూర్తి చేశాడు. గతంలోపంచాయతీ కార్యదర్శిగా, మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ శాఖల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చరణ్ ఎంపికపై కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

16న రగ్బీ జిల్లా జట్టు ఎంపిక

టెక్కలి: రగ్బీ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యాన జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 16న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి వారణాసి గోవింద్, పొన్నాడ పార్వతీశం ఒక ప్రకటనలో తెలిపారు. 2005 నుంచి 2007 మధ్య జన్మించి, ఆసక్తిగల వారు ఎంపిక పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. వీరు ఈ నెల 30 నుంచి మే 1వ తేదీ వరకు కర్నూలు జిల్లాలో జరగనున్న అంతర్ జిల్లా పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

నిరుపేదలకు నిత్యావసర సరుకులు

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని నగరంలోని డాడీ హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యాన అంబేద్కర్ విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా 30 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లను అందజేశారు. జిల్లావ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ డాడీ హెల్పింగ్ ఫౌండేషన్ పేదలకు అండగా నిలుస్తోందని ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు ఎస్.జోగినాయుడు అన్నారు. కార్యక్రమంలో డాడీ హెల్పింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుజ్జల ప్రభాస్ సూర్య, న్యూ బ్లడ్ బ్యాంకు మేనేజర్ మణికంఠ, బాక్సింగ్ కోచ్ ఉమామహేశ్వరరావు, అప్పారావు, దయా, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లక్కవరంవాసికి చికాగో యూనివర్సిటీ అవార్డు

సోంపేట: లక్కవరం గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు భావన శశికుమార్, కళ్యాణిల కుమారుడు భావన కృష్ణ చైతన్యకు చికాగో యూనివర్సిటీ ఆఫ్ ఇల్లీ నాయిస్ ఛాన్సులర్స్ స్టూడెంట్ సర్వీస్ అవార్డును ప్రదానం చేశారు. ఈ మేరకు శుక్రవారం తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు కృష్ణ చైతన్యను అభినందించారు. ఎల్‌కెజీ నుండి 8వ తరగతి వరకు కృష్ణ చైతన్య విశాఖలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చదివారు. ప్రస్తుతం చికాగోలోని యూనివర్సిటీలో బిటెక్ చదువుతున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు.



అవార్డుతో కృష్ణచైతన్య

20 మంది రక్తదానం

వజ్రపుకొత్తూరు: యువతరం సేవా సమితి అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రాణదాత బ్లడ్ బాంక్ సౌజన్యంతో పూండీ బస్టాండ్‌లో శుక్రవారం ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పూండీ పరిసర గ్రామాలకు చెందిన 20 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పలాసకు చెందిన మహీంద్ర హోం ఫైనాన్స్‌కు చెందిన మొత్తం 8 మంది సభ్యులు రక్తదానం చేయడంతో పలువురు అభినందించారు. యువతరం సేవా సమితి సభ్యులు రక్తదాతలకు పండ్ల రసం, ఫ్రూట్ సలాడ్స్ అందజేశారు. దక్తదాతలకు ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ ప్రశంసాపత్రాలు, యువతరం సేవా సమితి మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షులు చింత మురళి, కెంగువ రాంబాబు, జి.అశోక్, లింగరాజు, గణేష్, పృధ్వీ, రమేష్, ప్రతాప్, బాలరాజు, నారాయణరావు, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి – ఆమదాలవలస

పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి ఆమదాలవలస సబ్ స్టేషన్ పరిధిలోని ఆమదాలవలస నుండి శ్రీకాకుళం వెళ్లే మెయిన్ రోడ్డు వెడల్పు కారణంగా పొడవాటి స్తంభాలు మార్చడంలో భాగంగా ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు నందగిరిపేట, సనపలవానిపేట, కంచరవానిపేట, లంకాం, రైస్ మిల్ అండ్ బ్రిక్ ఇండస్ట్రీ, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

గ్రామదేవత ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి – ఇచ్ఛాపురం

ఈ నెల 17 నుండి ప్రాంభం కానున్న స్వేచ్ఛా వతి అమ్మవారు ఉత్సవాలకు అన్నీ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయని ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. శుక్రవారం ఆలయం వద్ద ఉత్సవాలకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం 17వ తేదీ రాత్రి నుండి పట్టణంలోని అన్ని వీధుల్లో అమ్మవారు తిరువీధి షెడ్యూల్ విడుదల చేశారు. ఏ రోజు ఏ వీధిలో అమ్మవారు తిరువీధి కార్యక్రమం ఉంటుందో ప్రజలకు ముందుగా తెలియజేయడం వల్ల వారు సిద్ధంగా ఉంటారని తెలిపారు. ఈనెల 30 వరకు తిరువీధి షెడ్యూల్ ఉంటుందని, ఆ తర్వాత ఉప్పలవీధి ఉత్సవ మండపం నుండి రథం వీధి వరకు తిరువీధి జరుగుతుందన్నారు. పట్టణములో చాలా వీధుల్లో తయారు చేస్తున్న రథాల వివరాలు వెంటేన్ కమిటీకి తెలియజేయాలని కోరారు.



ఉత్సవాల కరపత్రం ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాల నివారణ

ప్రజాశక్తి–పలాస

అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు సంభవించిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చి జరిగే నష్టాన్ని నివారించవచ్చునిమున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. శుక్రవారం జాతీయ అగ్నిమాపక దినోత్సవం సందర్భంగా పలాస అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలను జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా మృతి చెందిన జవాన్లుకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బంది సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఐ బొమ్మాళి సోమేశ్వరరావు, వైస్ చైర్మన్ మీసాల సురేష్, సిబ్బంది డి.భాస్కర్, కె.యుగంధర్, శ్రీనివాసరావు, ప్రేమ్‌కుమార్, మన్మదరావు, రామినాయుడులు పాల్గొన్నారు.

రణస్థలం: ఈ నెల 14 నుంచి 20 వరకు జరిగే అఖిల భారత అగ్నిమాపక వారోత్సవాలు వాల్ పోస్టర్‌ను రణస్థలం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పైలా అశోక్ ఆధ్వర్యంలో స్థానిక ఫైర్ స్టేషన్‌లో పద్మావతి ఫిల్లింగ్ స్టేషన్ యజమాని పిన్నింటి భానోజీనాయుడు, సూర్య ఆసుపత్రి ఎండి యశ్వంత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ అగ్నిమాపక అఖిలభారత వారోత్సవాలు ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని, వారోత్సవాలలో ప్రతిరోజు ఒక ప్రజా సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో మాక్ డ్రిల్ ఏర్పాటు చేసి, అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరు: అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని లోతుగెడ్డ వరప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక అగ్నిమాపక కేంద్రం వద్ద అగ్నిమాపక అధికారి జి.రామణమూర్తి అధ్యక్షతన అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భవనాలు, గృహాలు, పరిశ్రమలు, నిర్మాణాలు చేసేటప్పుడు ప్రమాదాలు జరకుండా నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అంపిలి ప్రశాంత్‌కుమార్, ఎస్.రమేష్, పి.వెంకటకృష్ణ, శ్రీను, టి.గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఎఎన్‌పేటలో శుక్రవారం నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అగ్నిమాపక అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలను పణంగా పెట్టి, ప్రజలను కాపాడుతున్నారని, వారి సేవలను కొనియాడారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్, ప్రశాంత్‌కుమార్, నీలాచలం, కామరాజు, కాశీ విశ్వనాథ్, ప్రసాద్, సాలిన ఢిల్లీ, ప్రకాష్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: శ్రీహరిపురంలో అగ్నిమాపక వారోత్సవాలు అగ్నిమాపక అధికారి కె.పాపారావు ఆధ్వర్యాన నిర్వహించారు. అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. తొలుత అమర అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



పలాస: మున్సిపల్ చైర్మన్‌కు పరికరాల ఉపయోగాలను వివరిస్తున్న అధికారి



కొత్తూరు : నివాళులర్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు



ఇచ్ఛాపురం : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు



ఆమదాలవలస : సెల్యూట్ చేస్తునన అగ్నిమాపకశాఖ అధికారి

వైసిపి పాలనలోనే మహిళా సంక్షేమం

ప్రజాశక్తి – నందిగాం

జగనన్న పాలనలోనే మహిళా సంక్షేమం సాధ్యమని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. శుక్రవారం వల్లభరాయుడుపాడులో సర్పంచ్ సీతారాం ఆధ్వర్యాన జగనన్నే మా భవిష్యత్ నిర్వహించారు. గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీరామ్మూర్తి, కురమాన బాలకృష్ణారావు, సర్లాన భైరాగి, చిన్ని జోగారావు, మడపాల సంజీవరావు, కె.ఎర్రన్న, బి.సోమేశ్వరరావు, దానయ్య, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలోని చీమలవలస పెద్దవీధిలో జగనన్నే మా భవిష్యత్ నిర్వహించారు. పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గతంలోని టిడిపి ప్రభుత్వ పాలనకు నేటి వైసిపి పాలనకు గల తేడాను ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్స్ గురుగుబెల్లి హేమలత, దవల విమలశేఖర్, బోడేపల్లి నీలయ్య, వాలంటీర్లు, గృహ సారథులు, తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: మహిళలతో మాట్లాడుతున్న ఢిల్లీ యాదవ్

సంతబొమ్మాళి: జగన్నాథపురంలో జగనన్నే మా భవిష్యత్ నిర్వహించారు. సర్పంచ్ జోగి రాములమ్మ ఆధ్వర్యాన ఇంటింటికీ స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో మత్స్యకార సొసైటీ అధ్యక్షులు పి.లక్ష్మణరావు, లండ రామారావు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌దేనని మున్సిపల్ జెసిఎస్ కన్వీనరు సాలీనా ఢిల్లీ యాదవ్ అన్నారు. జగనన్నే మా భవిష్యత్‌లో భాగంగా మూడో వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు.



నివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

డయాలసిస్ కేంద్రాల్లో అదనపు వసతులు కల్పించాలి

వైద్యారోగ్యశాఖ కమిషనర్‌ను కోరిన సీడాప్ చైర్మన్

ప్రజాశక్తి – ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని కవిటి, సోంపేట డయాలసిస్ కేంద్రాల్లో అదనపు డయాలసిస్ బెడ్స్, వసతులు కల్పించాలని వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ జె.నివాస్‌ను సీడాప్ ఎపి చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. డయాలసిస్ కేంద్రాల్లో కిడ్నీ రోగులకు సరిపడ పడకలు, ఇతర వసతులు కల్పించాలని కోరినట్లు చెప్పారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని, త్వరలో కార్యాచరణ ప్రారంభిస్తామని తెలిపారని అన్నారు. తొందరలోనే ఇచ్ఛాపురం, కంచిలి, బారువ ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాల పరిస్థితి చూసి, నివేదిక అందించినట్లు తెలిపారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి

రణస్థలం: వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించి, వడదెబ్బ వల్ల సంభవించే మరణాలను అరికట్టాలని మాస్ మీడియా అధికారి పి.వి.రమణ అన్నారు. పాతర్లపల్లి పిహెచ్‌సిలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ గిరిబాబు, చైతన్య, సిహెచ్‌ఒ వెంకటరావు, ఇఒ సురేష్ , సిబ్బంది పాల్గొన్నారు.

కలం గళం క్రియేషన్స్ ఆడియో రిలీజ్

పలాస: పట్టణంలోని సూదికొండలో డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి తోట సిమ్మయ్య ఆధ్వర్యంలో కలం గళం క్రియేషన్స్ రూపొందించిన బహుజన చైతన్య గీతాన్ని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు సంయుక్తంగా రిలీజ్ చేశారు. కరుణాకర్ మాస్టర్ కలం, దుర్యోధన మాస్టర్ గళం వినిపించారు. ఆడియో, వీడియోకు సిహెచ్ పద్మలోచనం స్పాన్సర్ గా వ్యవహరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శిస్టు గోపి, గిడుగు రామ్మూర్తి జానపద కళాపీఠం వ్యవస్థాపకులు బద్రి కూర్మారావు, దళిత హక్కుల పరిరక్షణ సమితి మండల అధ్యక్షులు నగిరి అరుణ్‌కుమార్, ఎన్‌జిఒ సంఘం మండల అధ్యక్షులు బి.గోపాల్, సవర జగన్నాయకులు, బి.అప్పారావు, పి.ఈశ్వరరావు, బి.ప్రేమ్‌చంద్, రవి, అప్పలరాజు పాల్గొన్నారు.



రిలీజ్ చేస్తున్న గిరిబాబు, సురేష్‌బాబు

విద్యార్థి దశే కీలకం

టెక్కలి: సమాజంలో ఉన్నతస్థానాల్ని ఆధిరోహించాలనుకునే వారు తమ బాల్య దశ, విద్యాభ్యాసమే కీలకమని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు వల్లభ మల్లయ్య, దూసి ఆంధ్రాస్టాలిన్ అన్నారు. ఓక్లాండ్ ఇంటర్నేషనల్ పాఠశాల్లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో వారు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో తట్టుకునే విధంగా విద్యార్థులు తయారు కావాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా మారాలని అభిప్రాయపడ్డారు. పాఠశాల ప్రిన్సిపాల్ మళ్లా మధులత మాట్లాడుతూ ప్రామాణికతతో కూడిన విద్యను ఈ ప్రాంత విద్యార్థులకు అందివ్వాలనేదే తమ లక్ష్యమని అన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల నృత్యాలు ఆలరించాయి. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు చింతాడ పార్వతీశం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అలరించిన చిన్నారుల ప్రదర్శన

'ఉపాధి' పనులు ప్రారంభం

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి పంచాయతీ సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి శుక్రవారం ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం తొందరగా పనుల్లోకి రావాలని, సమయ పాలన పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అట్టాడ ఇంధుమతి, వైసిపి నాయకులు కళింగపట్నం అప్పారావు, అట్టాడ రమణ, ఎపిఒ వాసునాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ మురళి, ఫీల్డ్ అసిస్టెంట్ కింజరాపు కృష్ణమూర్తి, వి.దుర్గారావు, మేట్లు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మి

వైభవంగా మేష సంక్రమణం

ప్రజాశక్తి – కవిటి

కవిటి శ్రీ చింతామణి అమ్మవారి ఆలయంలో మేష సంక్రమణ పూజలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు దంపతులు, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కుంకుమ పూజల్లో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు. అనంతరం జరిగిన అన్నదానానికి యాత్రికులు భారీగా తరలివచ్చారు. యాత్రికులు ఎటువంటి ఇబ్బంది పడకుండా ఆలయ కమిటీ సభ్యులు, ఉషోదయ యువజన సంఘం సభ్యులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు.



జెడ్‌పి చైర్‌పర్సన్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు